# లేమియే నరకమ్ము



రాత్రి ఏడుగంటలు...!

శీతాకాలం... చీకటి అప్పటికే బాగా చిక్కబడింది !

జోగిరాజు... ఆ భోజన హోటలుముందుచేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు.

హోటలు వచ్చేపోయే వాళ్ళతో సందడిగా ఉంది. భోజనం చేసి తృప్తిగా త్రేనుస్తూ బయటకు వచ్చేవాళ్లను చూస్తొంటే జోగిరాజుకు ఈర్ష్యగా ఉంది. అతని కడుపు కరకరలాడుతోంది...

హోటలు ముందు ఇద్దరు ముష్టివాళ్లు... "అయ్యా ! బాబూ !" అంటూ అదే పనిగా అడుక్కుంటున్నారు !" వాళ్ళే నయం. అదృష్ట వంతులు !" అనుకున్నాడు జోగిరాజు.

జోగిరాజుకు ఆ ముష్టివాళ్ళలా అడుక్కునే సాహసమూ లేదు. హోటలు నుంచి బయటకు వచ్చేవాళ్ళలా, దర్జాగా వెళ్ళి ఆకలి తీర్చుకునే అవకాశమూ లేదు.

అతని జేబులో అయిదు పైసలు కూడా లేవని చెప్పడం అంత అవసరమూ కాదు.

జోగిరాజుకిప్పుడు తన ఆకలి సమస్య కాదు...

గుడిసెలాంటి తన చిన్న ఇంట్లో ఆవురావురు మంటూన్న అయిదు జీవాల ఆకలి...

ఈ పూట ఎలాగైనా తీర్చాలి : తీర్చకపోతే...?

పెద్దవాళ్లు నీళ్ళు త్రాగి ఆకలికి తట్టుకో గలరే మోగాని... చిన్న పిల్లలు మాత్రం శోష వచ్చిపడి పోతారు. ఇంట్లో వాళ్ళందరూ, రెండు రోజులుగా పస్తులే ఉంటున్నారు. ఆకలి... దరిద్రం, ఆ యింట్లో విలయతాండవం చేస్తున్నాయి... ఎలా ? ఏం చేయాలిప్పుడు...? అన్నం దొరికే మార్గం...? ఆకలి తీరేదారి...?

జోగిరాజు గంటకుపైగా ఆ హోటలు ముందు... అయోమయంగా తచ్చాడుతున్నాడు.

జోగిరాజు ఒకప్పుడు ఆ పెద్దపట్టణంలోని పేపరు మిల్లులో సాధారణ కార్మికుడే ! జీతం ఎనిమిది వందల ఏభై రూపాయలు...ఆరునెలలుగా ఇప్పుడతనికి ఆ జీతం లేదు. ఆ పేపరు మిల్లు నడవటం లేదు. యాజమాన్యం పగబట్టి... ఒకే కత్తివాటుతో తెగనరికినట్లు వందమంది కార్మికుల ఉద్యోగాలు ఊడబెరికి బయటకు పొమ్మంది. యూనియన్ గొడవ పెట్టింది. గోల చేసింది. యాజమాన్యం చలించలేదు... నెలల తరబడి నిరాహారదీక్షలు నడిచాయి... ప్రభుత్వం కలగజేసుకుంది. తమకు సగానికి సగం నష్టం వస్తోందని... ఉత్పత్తికి గిట్టుబాటు ధర ప్రభుత్వం ఇవ్వడంలేదని యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. ఫేక్టరీ మూతపడింది...

కాలం ముందుకు నడుస్తోంది... యాజమాన్యం కిమ్మనకుండా ఊరుకుంది. ప్రభుత్వమూ కళ్ళు మూసుకుంది. అంతటా ఆర్తనాదాలు! కార్మికుల కళ్ళల్లో కన్నీటి సెలయేళ్ళు... ఏ గుడిసెలోనూ గుప్పుమని పొయ్యి వెలగడం లేదు. ఏదో చేతనయిన వాళ్లు కొంతమంది కూలి పనికెళ్ళడం మొదలు పెట్టారు. కొందరు చెంబూ తపేలా అమ్ముకున్నారు... కొదరు తాళిబొట్లూ తెగమార్చు కున్నారు.

ఉద్యోగం ఊడబెరికినవాళ్లలో జోగిరాజూ ఉన్నాడు... అతని పరిస్థితి మరింత దయనీయం. జోగిరాజుకు ఒక కాలు కొద్దిగా అవిటిది... కాలు ఎత్తిపెట్టి నడుస్తాడు. పైగా మనిషి అర్భకుడు. చొరవగా ఏ కూలిపనికీ వెళ్ళలేడు. ఇంట్లో ఉన్నవి అతనితో బాటు ఆరు జీవాలు... ఓ ముసలి తల్లి... భార్య... ముగ్గురు పిల్లలు ! ఎలా వాళ్ళ ఆకలి తీర్చడం...?

ఆరు నెలలుగా ఇంట్లో ఉన్న సామాన్లు అన్నిటినీ అమ్మేశాడు జోగిరాజు. రెండు మేకలు, ఆరు కోడిపెట్టలు కూడా అంగట్లో అమ్ముడయి పోయాయి. భార్య తాళిబొట్టూ తాకట్టు పెట్టడం జరిగింది. తెలిసిన వాళ్లందరి దగ్గరా అప్పులు చేయడం. కొండొకచోట 'ఛీ' అనిపించుకోవడం మామూలయింది.

జోగిరాజు భార్య మూణ్ణెల్ల క్రితం... పరిస్థితిని ఆకళింపు చేసుకుని ఒక ఇంట్లో పనిమనిషిగా చేరింది. సాగుబాటుకు కొంతసాయం... ఊరడింపు దొరికాయి. కానీ వారం రోజుల క్రితం ఆమె కూడా మూలపడింది. కాళ్ళు పట్లు తప్పాయి అంటుంది. నడుములేవడంలేదంటుంది. నీరసం నెత్తినేసుకుని పక్కకు అంటిపెట్టుకుపోతుంది. పిల్లల గోల... ఆకలి... ఆర్తనాదాలు... పెనుమంటలు...!

జోగిరాజు హోటలు వద్ద తచ్చాడుతూ ఒక అడుగుముందుకు వేశాడు.

మరో అడుగువేశాడు. హోటలు గుమ్మంలోకి అడుగుపెడుతూంటే... కౌంటర్లో ఉన్న వ్యక్తి మాసిన బట్టల్లో ఉన్న జోగిరాజు రూపాన్ని వింతగా చూశాడు.

"ఏదైనా పనిచేస్తాను సార్ ! కాస్త అన్నం పెట్టించండి !" హోటలు లోపలికి వెళ్ళి జోగిరాజు రెండు చేతులు జోడించాడు.

కౌంటరులో కూర్చున్న వ్యక్తి జోగిరాజును తేరిపార చూశాడు. బెల్లుకొట్టి ఎవరో కుర్రాడ్ని పేరు పెట్టిపిలిచాడు. జోగిరాజు అదృష్టం బాగుంది... ఆ పూట ఇద్దరు కుర్రాళ్ళు పనికి రాలేదు. జోగిరాజు ఆ కుర్రాడి వెంట లోపలికి వెళ్ళాడు. అక్కడంతా తడిగా, బురద బురదగా, నానా గలీజుగా ఉంది. వంటమనుషులు, పనివాళ్ళు... పొగ... మండుతున్న పొయ్యిలు, అక్కడ అందరూ ఉక్కిరిబిక్కిరి అవుతూ... ఊపిరి సలపకుండా పనిలో నిమగ్న

మయిఉన్నారు.

అక్కడ జోగిరాజు ఎవరెవరో భోజనం చేసి వదిలేసిన ఎంగిలిప్లేట్లు కడిగాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అలవాటు లేని పని. అయినా తప్పదు. ఆకలి, అవసరం... నీరసంతో నాలుగు గంగాళాల్లోకి నీళ్ల తోడి నింపాడు. ఇంకా చిన్న చిన్నవి చెప్పినపనులన్నీ చేశాడు. ఫలితం... వంట అయ్యరు రెండు అన్నం పొట్లాలు కట్టి ఇచ్చాడు. ప్రొప్రయిటరు మూడు రూపాయలు చేతిలో పెట్టాడు.

రాత్రి తొమ్మిది గంటలు... జోగిరాజు హోటలు నుంచి బయటకు వచ్చాడు.

రోడ్డు మీద నడుస్తున్నాడు... అతని అడుగులు తేలిపడుతున్నాయి. జోగిరాజు చేతిలో రెండు అన్నం పొట్లాలు ఉన్నాయి. జేబులో మూడు రూపాయి కాగితాలు ఉన్నాయి... జోగిరాజు మనసులో ఆనందం... ఉద్వేగం...

దుఃఖం... కోపం... కసి... అసహ్యం... ఆవేదన...!

ఆరు జీవాల ఆకలి, రెండు అన్నం పొట్లాలు...

అతను గబగబా రోడ్డు మీద అడుగులు వేస్తున్నాడు.

జనం... జనం... పరుగులెత్తే జనం... ఉరకలెత్తే జనం... అంతటా ఆనందం... వాహనాల ధ్వనులు... జోరు... హోరు... జోగిరాజు నడుస్తున్నాడు...

దీపాలు తెల్లగా వెలుగుతున్నాయి. దుకాణాలు తెరిచే ఉన్నాయి.

జోగిరాజుకు ఒక భయంకరమైన ఆలోచన వచ్చింది ! అతను ఒక దుకాణం వద్ద ఆగాడు. జేబులోంచి మూడు రూపాయలు తీసి కొట్టువాడి చేతిలో పెట్టాడు. ఆ కొట్టువాడు జోగిరాజుకో పొట్లాం ఇచ్చాడు.

జోగిరాజు ఆ పొట్లాన్ని అతి జాగ్రత్తగా తీసుకుని... తన చేతిలో ఉన్న రెండు అన్నం పొట్లాలతోనూ కలిపి పట్టుకున్నాడు.

జోగిరాజుకిప్పుడు తృప్తిగా ఉంది. ఆనందంగా ఉంది...

అతను మరింత వేగంతో. రోడ్డు మీద అడుగులు వేస్తున్నాడు...

..... ..... .....

రాత్రి పదిగంటలు...

ఊరి చివర, గుడిసెకంటే కాస్త పెద్దదైన ఆ చిన్న ఇంట్లో గుడ్డి దీపం వెలుగుతోంది. ఆ వెలుతురులో మూడు జీవాలు ముక్కుతూ మూలుగుతూ చాపమీద శోష వచ్చినట్లుగా దొర్లుతున్నాయి. మరో రెండు జీవాలు రెండు నులక మంచాల్లో నిస్సత్తువుగా నిద్రపోతున్నట్టు పడిఉన్నాయి.

ఆ గదిలో నిశ్శబ్దం నిట్టూర్పులు విడుస్తోంది. ఆ గదిలో దరిద్రం ఆకలి రాగం ఆలాపిస్తోంది. ఆ గదిలో మౌన వేదన... రోదన...!

ఆ గదిలో ఒక మూలగా ఉన్న కుండలో సగం నీళ్ళు మాత్రమే ఉన్నాయి.

జోగిరాజు పరుగులాంటి నడకతో ఇంట్లోకి వచ్చి పడ్డాడు. ముగ్గురు పిల్లల్ని తట్టి నిద్రలేపాడు. ముసలి తల్లిని అమ్మా అంటూ లేవదీశాడు. రోగిష్ఠి భార్యను రెక్కబట్టుకుని కూర్చోబెట్టాడు. తెచ్చిన అన్నం పొట్లాలు విప్పి అందరికీ ఆకుల్లో పంచాడు. తనూ రెండు ముద్దలు ఆత్రంగా నోట్లో పెట్టుకున్నాడు. ఆశగా... ఆబగా ఆవురావురు మంటూ లోకంలోని ఆకలిఅంతా తమ కడుపుల్లోనే ఉన్నంత కక్కుర్తిగా... వాళ్ళు అన్నం తింటుంటే జోగిరాజు నిశ్చలంగా అలాగే చూస్తున్నాడు...

జోగిరాజుకు దుఃఖం ఉబికివస్తోంది. కళ్ళల్లో నీళ్ళు ధారలుగా కారుతున్నాయి.

కనిపించని కబంధహస్తమేదో గొంతు నులుముతున్నంత బాధ... దుఃఖం... అన్నంతిని కుండలోని నీళ్ళు త్రాగి నిస్త్రాణగా ఇంట్లో వాళ్ళందరూ నిద్రకు ఒరిగిపోయారు... జోగిరాజుకూ నిద్రవస్తోంది... కళ్ళు మూసుకుపోతున్నాయి...

ఈ రోజు హోటల్లో తను ఎంగిలి ప్లేటు కడిగి ఈ అన్నం సంపాదించాడు. వీళ్ళ ఆకలి

తీర్చాడు. మరి రేపు...? రేపు ఈ ఆకలి ఉండదు... ఈ దుఃఖం ఉండదు... ఈ దరిద్రం ఉడదు... ఈ దౌర్భాగ్యం ఉండదు... ఈ సమస్య ఉండదు... అన్నీ తుడిచి పెట్టుకుపోతాయి. ఈ ఇంట్లో ఆకలి అనే అరుపు వినబడదు... ఆకలి చచ్చిపోతుంది. ఆకలి దారుణంగా ఆత్మహత్య చేసుకుంటుంది...

అందుకే తను అన్నంలోమూడు రూపాయలు పెట్టి కొన్న పురుగుల మందు కలిపాడు. తన వాళ్ళతో తినిపించాడు. తను తిన్నాడు... ఈ పూటతో తనకు తన కుటుంబానికి ఈ ప్రపంచంతో సంబంధం తెగిపోతుంది... ఈ మనుషులతో రుణం పూర్తిగా తీరిపోతుంది...

జోగిరాజు ఏడుస్తున్నాడు. పొర్లుకు వస్తోన్న దుఃఖంతో... జోగిరాజు ఏడుస్తున్నాడు. అగ్నిగోళంలా మండుతూన్న అంతరంగంతో... జోగిరాజు ఏడుస్తున్నాడు... అసహాయత నిండిన ఆవేదనతో... జోగిరాజు ఏడుస్తున్నాడు... బ్రతుకుమీద పెంచుకున్న అసహ్యంతో... ఏడుస్తున్నాడు...

అతని కళ్ళు వాలిపోతున్నాయి. జోగిరాజు ఏడుస్తూనే ఉన్నాడు.

అర్ధరాత్రి దాటింది. జోగిరాజు గుడిసెలో హాహాకారాలు... అరుపులు పెద్దపెట్టున ప్రారంభమయ్యాయి. ఆ గోలకు పేట పేటంతా నిద్రలేచారు. గుంపుగా జోగిరాజు గుడిసెలోకి చొరబడ్డారు. అక్కడ జోగిరాజుతో సహా ఆరు శాల్తీలు గిలగిలా కొట్టుకుంటున్నాయి. ఎవర్ని పలకరించినా బదులు లేదు... అందరి నోళ్ళనుంచి తెల్లటి నురగలు... బుడగలు...

జనం సాయం పట్టారు... జోగిరాజుని, జోగిరాజు కుటుంబాన్ని ధర్మాసుపత్రికి మోసుకు పోయారు. నిద్రపోతోన్న డాక్టర్లని గొడవచేసి గోలచేసి నిద్రలేపారు.

ముగ్గురు డాక్టర్లు మృత్యువుతో పోరాడుతోన్న ఆరు జీవాల్ని ఎమర్జన్సీ వార్డుకు తరలించారు. నిముషాలు గంటలుగా మారి నిట్టూర్పులు విడిచాయి. డాక్టర్లు బయటకొచ్చారు. తమ శక్తి యుక్తుల్ని ధారపోశామన్నారు...

కాని జోగిరాజు కుటుంబ సభ్యులు శవాలుగా మారిపోయారు.

చూస్తున్నవాళ్ళు... చుట్టుపక్కలవాళ్ళు కన్నీళ్ళు కారుస్తున్నారు.

అదృష్టమో, దురదృష్టమో ఆరోజీవం జోగిరాజు మాత్రం బ్రతికాడు.

అతను ప్రమాదం నుంచి బయటపడ్డాడు... పోలీసులు రంగప్రవేశం చేశారు.

జోగిరాజుకు గంట తరువాత స్పృహ వచ్చింది. అతను ఆరుస్తున్నాడు. పిచ్చివాడిలా కేకలు పెడుతున్నాడు... గుండెలు బాదుకుంటున్నాడు... జుట్టు పీక్కుంటున్నాడు...

"నన్నెందుకు బ్రతికించారు డాక్టరుగారూ ! నన్ను చంపేయండి... నేను బతక్కూడదు... చంపేయండి బాబూ... చంపేయండి... ఎస్.ఐ. గారూ మీ దగ్గర తుపాకీ ఉంటే నన్ను కాల్చేయండి... నేను పాపాత్ముణ్ణి... దుర్మార్గుణ్ణి... దౌర్భాగ్యుణ్ణి... నావాళ్ళందరూ పోయినా నేనింకా బ్రతికే ఉన్నాను... వద్దు బాబూ... నాకీ శిక్ష వద్దు... నా వాళ్లందర్నీ నేనే చంపాను... ఎందుకో తెలుసా బాబు...? నావాళ్ళని నేను పోషించలేను... వాళ్ళ ఆకలి తీర్చలేను... నాకు ఉద్యోం లేదు... ఉపాధిలేదు... అందుకే ఆకల్ని హత్య చేయాలనుకున్నాను... నావాళ్ళంటే నాకు ప్రాణం బాబూ... కానీ ఆకలి నా శత్రువు... ఆకలి నా కసి... ఆకలి నా కోపం... ఆకలి నా గురి... ఆకలి నాగమ్యం... అందుకే ఆకల్ని హత్య చేశాను... హత్య చేశాను... హత్య...హత్య...హత్య...

జోగిరాజు ఏడుస్తూ నవ్వుతున్నాడు... నవ్వుతూ ఏడుస్తున్నాడు.

జోగిరాజు రోడ్డు మీద నడుస్తూనే ఉన్నాడు...

"ఒరేయ్ ! ఎవడ్రా నువ్వు...! బతకాలని లేదా నీకు...?"

లారీ ముందుకు దూసుకుపోయింది. జోగి రాజు అదిరిపడి ప్రక్కకు తప్పుకున్నాడు. అతనికి ఒళ్ళంతా చెమటపట్టేసింది. జోగిరాజు తనని తాను

తడిమిచూసుకున్నాడు. చేతిలో రెండు అన్నం పొట్లాలు అలాగే ఉన్నాయి. వాటితో బాటు దారిలో కొన్న పురుగుల మందు పొట్లం కూడా ఉంది...

ఏమిటిది...? తను, తనవాళ్ళనింకా చంపలేదా...? ఇదంతా తన ఊహ... తన పిచ్చి పిచ్చి ఆకలి ఆలోచనలు... కానీ ఎంతదారుణంగా ఊహించాడు...? ఎంత భయంకరంగా ఆలోచించాడు...? తన వాళ్ళని చంపేసినట్టు... తను బ్రతికి బయటపడ్డట్టు... ఓహ్... ఎంత నరకం...? నిజానికి తన భార్యని, పిల్లల్ని ముసలి తల్లిని చంపేయాలనే పురుగులమందు కొన్నాడు... కానీ... ఏమిటి చెయ్యడం...?

జోగిరాజు ఇంటికి చేరేటప్పటికి అతని భార్య... ముసలి తల్లి... పదేళ్ళ కొడుకు మెలకువగా గుమ్మం దగ్గరే ఎదురుచూస్తూ కూర్చున్నారు.

"ఒరేయ్ ! జోగీ ! ఏడకుపోయ్యావురా...? సీకటడినకాడ్నించి కళ్ళల్లో ఒత్తులెట్టుకుని సూత్తన్నా... ఇంతరేత్రయినా రాకపోతివి... పేణం ఎట్టా కొట్టుకులాడతందో..." ముసలి తల్లి ముందు వచ్చి జోగిరాజు చేయి పట్టుకుంది...! వణుకుతూన్న ఆమె చేయిని గట్టిగా పట్టుకున్నాడు జోగిరాజు.

'ఏంచయ్యా ! పొద్దుటనగా పోయావ్... గెంజి కూడా తాగలేదు... ఓపిక తెచ్చుకుని ఒకరింట్లో పన్లోకెళ్తే... తవ్వెడు నూకలిచ్చారు... గెంజి కాశాను... రా !. తాగుదువు గాని...' భార్య గబగబా ఇంట్లోకి వెళ్ళి ప్లాస్టిక్ చెంబుతో నీళ్ళు తెచ్చింది.

"అయ్యా ! అయ్యా ! నువ్వెక్కడికీ తిరగొద్దయ్యా... హోటల్లో పనిసేత్తే అయ్యేరు రోజుకు అయిదు రూపాయలిత్తాడంట... రేపట్నుంచి నేను పన్లోకెల్తానయ్యా..." పదేళ్ళ కొడుకు వచ్చి జోగిరాజు కాళ్ళను చుట్టుకున్నాడు.

జోగిరాజు నిలువునా చలించిపోతున్నాడు... కరిగి నీరయిపోతున్నాడు. నీరయి నిలుచున్నచోటనే నేలలోకి కూరుకుపోతున్నాడు...

తల్లి ప్రేమ... వాత్సల్యం... భార్య అనురాగం... ఆత్మీయత... కొడుకు ధైర్యం... ఆసరా..

ఎంత తప్పు చేయబోయాడు తను...? ఎంత ఘోరం తలబెట్టబోయాడు ? పురుగుల మందుతో వీళ్ళ పీడవదిలించుకోబోయాడు. వీళ్ళను చంపే హక్కు తనకు ఉందా ? వీళ్ళకు తిండిపెట్టలేక పోవచ్చు. పోషించకపోవచ్చు. పోషించలేనంత మాత్రాన చంపే హక్కు తనకు ఉందా ? ఎంత మాత్రం లేదు... తనకు తాను చావాలనుకోవడం తప్పు... తన వాళ్లని చంపాలనుకోవడం అంతకంటే ఘోరమైన తప్పు... తను బ్రతకాలి. తన వాళ్ళని బ్రతికించాలి... ఎంగిలి ప్లేట్లు కడిగి అయినాసరే. ఏ పనిచేసి అయినాసరే బతకాలి. ఎంతమంది బతకటంలేదు...? లేమి నరకమే... దరిద్రం శాపమే... కాని అది బతుకుల్ని అంతం చేసుకునే పాపం కాకూడదు... ఒకరికోసం ఒకరు బతకడంలోనే జీవితానికి అర్థం ఉందేమో...'

జోగిరాజు చటుక్కున తన చేతిలోని పురుగుల మందు పొట్లాన్ని దూరంగా చీకట్లోకి విసిరేశాడు.

"రండమ్మా ! మీకోసం అన్నం పొట్లాలు తెచ్చాను... అందరం కలిసి తిందాం..."

జోగిరాజు తన వాళ్లని తీసుకుని ఇంట్లోకి నడిచాడు...!

ఈనాడు ఆదివారంఅనుబంధం
13-8-1989